సాక్షి అనకాపల్లి

మంగళవారం । 4 । జూన్ । 2024



అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ నిత్య కల్యాణం జరిపించారు.



చేపల వేటకు సన్నాహం

విశాఖ: వేట విరామం గడువు దగ్గరకు వస్తుండడంతో మత్స్యకారులు వేటకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం 32.5/24.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండుచోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.



జిల్లాలో పోలింగ్ శాతం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
83.84	12,89,371	10,81,042	5,26,106	5,54,924	12

టెక్..టెక్..టెక్..

- అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు
- 6 నియోజకవర్గాల లెక్కింపునకు 84 టేబుళ్ల ఏర్పాటు
- తొలుత 19,374 పోస్టల్, సర్వీసు ఓట్ల కౌంటింగ్
- 320 సీసీ కెమెరాల నిఘా మధ్య సాగనున్న ప్రక్రియ
- 2,000 మందికి పైగా పోలీస్, ఏపీఎస్పీ, ఏఆర్, పారా మిలటరీ దళాలు
- అసెంబ్లీ, పార్లమెంట్ల వారీగా టేబుళ్లు సిద్ధం



అనకాపల్లి మండలం శంకరం గ్రామంలోని కౌంటింగ్ కేంద్రంలో సిద్ధం చేసిన టేబుళ్లు

సాక్షి, అనకాపల్లి: ఎప్పుడెప్పుడా అని అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు కొద్ది గంటల్లో వెలువడనున్నాయి. గత నెల 13వ తేదీన అనకాపల్లి పార్లమెంటు స్థానానికి, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ పూర్తి కాగా 21 రోజుల తర్వాత మంగళవారం లెక్కింపు జరగనుంది. కీలకమైన ఈ ఘట్టాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు అనకాపల్లి మండలం శంకరంలో ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించిన తర్వాత ఈవీఎంల ఓట్లు లెక్కిస్తారు. ఇందు కోసం అసెంబ్లీ, పార్లమెంట్ వారీగా టేబుళ్లు సిద్ధం చేశారు. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున 6 సెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించి 84 టేబుళ్ల ఏర్పాట్లు చేశారు. రౌండ్ల వారీగా ఆయా నియోజకవర్గాల ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉదయం 8:45 గంటలకు ప్రతి నియోజకవర్గంలోని తొలి రౌండ్ ఫలితం వెల్లడి కావచ్చని అంచనా.. గంటకు 3 నుంచి 4 రౌండ్ల ఫలితాలు రానుండగా.. ఉదయం 11 గంటలకు ఫలితాల సరళి స్పష్టం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తుది ఫలితాలు వెల్లడి కానున్నాయి. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని పెందుర్తి ఓట్లను విశాఖలో లెక్కిస్తారు. రాత్రి 8 గంటల తర్వాత అనకాల్లి పార్లమెంట్ ఫలితం తేలవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపులో దాదాపు 1500 మంది ఉద్యోగులు పాల్గొంటారు.



నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్లు.. అనకాపల్లి కౌంటింగ్ కేంద్రానికి తరలింపు



సిబ్బందిని తనిఖీ చేసి కౌంటింగ్ కేంద్రంలోకి పంపిస్తున్న భద్రతా సిబ్బంది

తొలుత హోం, పోస్టల్, సర్వీస్ ఓట్ల లెక్కింపు

రిటర్నింగ్ అధికారి టేబుల్ దగ్గర ప్రత్యేకంగా నియమించిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఆ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లు, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారి ఓట్లను అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా తొలుత లెక్కిస్తారు. జిల్లాలో హోమ్ ఓట్లు 1082, ఎన్నికల సిబ్బంది ఓట్లు 12,864, సర్వీసు ఓట్లు 1051, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నవారి ఓట్లు 2,909 మొత్తం 19,374 ఓట్లు ఉన్నాయి. వీటి లెక్కింపు పూర్తయిన తరువాత ఈవీఎంల ఓట్లు లెక్కించనున్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు ఇలా..

చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కో కౌంటింగ్ హాల్ వుంటుంది. ప్రతి కౌంటింగ్ హాల్లో 14 టేబుళ్ల ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఉన్న ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 84 టేబుళ్ల ఉంటాయి. వీటితో పాటుగా పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు మరో ఆరు హాళ్లలో 14 టేబుళ్ల చొప్పున సిద్ధం చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. లెక్కింపు సమయంలో గెజిటెడ్ ర్యాంకు కల్గిన స్టాఫ్ కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్, ఈవీఎంలు అందజేయడానికి ఇద్దరు వీఆర్వో (బీఎల్వోలుగా పనిచేసినవారు) ఉంటారు.

మరోసారి ఫ్యాన్ ప్రభంజనమే..

ప్రీపోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ గెలుపును ఖాయం చేశాయి. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతుందని తేల్చేశాయి. పుట్టింది మొదలు ఉద్యమాలతో ఉరకలెత్తుతూ ప్రజాక్షేత్రంలో ప్రజాసమస్యలపై అవిశ్రాంత పోరాటం చేసిన వైఎస్సార్‌సీపీ గత ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది. ఉమ్మడి విశాఖలో ఏకంగా 11 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. విశాఖ నగరంలోని నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధించగా.. ఈసారి ఆ స్థానాలన్నింటిలోనూ ఫ్యాన్ గాలి వీస్తుందని అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన ఎగ్జిట్‌పోల్స్ అన్నీ తమకు వ్యతిరేకంగా రావడంతో టీడీపీ శ్రేణులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నా.. మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన తాయిలాలు తమను గట్టెక్కించకపోతాయా అన్న దింపుడు కళ్లెం ఆశతో ఉన్నాయి.

తొలి ఫలితం మాడుగుల.. తుది ఫలితం పాయకరావుపేట

పోలింగ్ కేంద్రాలు, రౌండ్లు తక్కువగా ఉన్న మాడుగుల అసెంబ్లీ ఫలితం తొలుత వెలువడుతుందని అంచనా వేస్తున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్న పాయకరావుపేట ఫలితం చివరిగా తేలవచ్చంటున్నారు. అనకాపల్లి లోక్‌సభ స్థానానికి 15 మంది పోటీలో నిలవగా.. జిల్లాలోని 6 అసెంబ్లీ స్థానాల్లో 54 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అత్యధికంగా అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి 12 మంది పోటీలో నిలవగా.. అత్యల్పంగా చోడవరం అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఆరుగురు బరిలో నిలిచారు. ఇంకా నర్సీపట్నం నుంచి 8 మంది, పాయకరావుపేట నుంచి 9 మంది, మాడుగుల నుంచి 9 మంది, యలమంచిలి నుంచి 10 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

ప్రతి రౌండ్‌కు అర్ధ గంట

ప్రతి రౌండ్ లెక్కింపునకు సగటున అరగంట పడుతుందని అంచనా. ప్రతి రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున లెక్కింపు జరగనుంది.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు
చోడవరం	243	18
పాయకరావుపేట	292	21
మాడుగుల	235	17
అనకాపల్లి	251	18
యలమంచిలి	246	18
నర్సీపట్నం	262	19

ట్రాఫిక్ ఆంక్షలు

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో అనకాపల్లి పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి..

- నేషనల్ హైవే–16, సుంకరమెట్ట జంక్షన్ మీదుగా.. బొజ్జన కొండ రోడ్డు వైపు కౌంటింగ్ కేంద్రానికి వచ్చేవారు రేబాక అండర్ పాస్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ ఆర్చ్ నుంచి రావాలి. ఈ మార్గంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు, మీడియాకు మాత్రమే అనుమతి ఉంటుంది.
- ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది రేబాక అండర్ పాస్ నుంచి గోపాలపురం రోడ్డు మీదుగా బట్లపూడి విలేజ్ కాలనీ దగ్గర వాహనాలను పార్కు చేసుకోవాలి.
- గొలగాం గ్రామం పడమర వైపు కల్పనా లేఅవుట్ వైపు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
- బట్లపూడి విలేజ్ కాలనీ ఆలయం ప్రాంగణం వైపు కౌంటింగ్‌కు హాజరయ్యే అధికారులు, సిబ్బంది వాహనాలను అనుమతిస్తారు.
- కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఎలక్షన్ కమిషన్ అనుమతించిన మీడియా వారికి చెందిన వాహనాలు మాత్రమే అనుమతి
- కలెక్టరేట్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- కౌంటింగ్ సందర్భంగా సుంకరమెట్ట జంక్షన్ నుంచి రేబాక, జిల్లా కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



కౌంటింగ్‌కు పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నాం. కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగంచెల భద్రత ఉంది. 320 సీసీ కెమెరాల నిఘా మధ్య కౌంటింగ్ జరుగుతుంది. 2,000 మందికి పైగా పోలీస్, ఏపీఎస్పీ, ఏఆర్, పారా మిలటరీ దళాలతో భారీ భద్రత ఉంది. కౌంటింగ్ కేంద్రం సమీపంలో 2 కిలోమీటర్ల మేర రెడ్‌జోన్‌గా ప్రకటించాం. అధికారులకు, అభ్యర్థులకు వెబ్‌కాస్టింగ్‌తో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. కౌంటింగ్ ఏజెంట్లు తెల్ల కాగితం, పెన్, పెన్సిల్ మాత్రమే తీసుకురావాలి. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్‌కు అనుమతి లేదు. అభ్యర్థులు, అధికారులు, కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు తమకు కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేసుకోవాలి. మీడియా కౌంటర్ వద్దే మొబైల్ ఫోన్లు ఉంచాలి. లోపలకి అనుమతి లేదు. వివిధ పార్టీల కార్యాలయాల వద్ద, పోటీ చేసే అభ్యర్థుల ఇళ్ల వద్ద భద్రత పెంచాం. విజయోత్సవ సంబరాలు కూడా నిషేధించాం. ఎవరూ బాణసంచా పేల్చకూడదు.

– రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎన్నికల అధికారి

న్యూస్‌రీల్

నర్సీపట్నంలో పక్కాగా ప్లాస్టిక్ నిషేధం



మాట్లాడుతున్న కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం: ఈనెల 4వ తేదీ నుంచి మున్సిపాలిటీలో పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వస్తోందని మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు పేర్కొన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై సోమవారం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్లాస్టిక్ వాడకం క్రమేపీ తగ్గించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ విక్రయాలు జరిపే దుకాణాలపై విస్తృతంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. ప్రజల సహకారంతో ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు మనందరం పాటుపడదామన్నారు.

అందరి చూపు 'శంకరం' వైపే..

తుమ్మపాల: నూతన అనకాపల్లి జిల్లాలో తొలి సారిగా జరిగిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు శంకరం వేదిక కావడంతో అందరి దృష్టి ఆ గ్రామంపైనే ఉంది. అనకాపల్లి – సబ్బవరం రహదారికి ఆనుకుని శంకరం గ్రామంలోనే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు ఉండడంతోపాటు.. ఇప్పుడు ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు కూడా ఇక్కడే ఏర్పాటు కావడంతో ప్రాధాన్యం పెరిగింది. వందల కొద్దీ వాహనాల రాకపోకలు, పోలీసుల భారీ బందోబస్తుతో గ్రామమంతా సందడి నెలకొంది. ఈ గ్రామాన్ని పూర్తిగా రెడ్‌జోన్‌గా ప్రకటించినప్పటికీ జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చే వివిధ పార్టీల క్యాడర్ మంగళవారం ఇక్కడే ఫలితాల కోసం నిరీక్షించనున్నారు.

మద్యం విక్రయాలపై ముమ్మర తనిఖీలు



కిరాణా దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

తుమ్మపాల: కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల పరిధిలో గ్రామాలైన బట్లపూడి, శంకరం, రేబాక, గొలగాం గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలపై అబ్కారీ శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం వేర్వేరుగా ముమ్మర తనిఖీలు చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల వరకు రెడ్‌జోన్ ఉన్నప్పటికీ గొలుసుకట్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు సోమవారం 'రెడ్ జోన్‌లోనూ అక్రమంగా మద్యం అమ్మకాలు' అనే శీర్షిక సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. అబ్కారీ శాఖ గోడౌన్‌లో కళాసీలు ఎటువంటి అక్రమ మద్యం తరలించలేదని విచారణలో తేలియజేసినట్లు డిపో మేనేజర్ సునిత తెలిపారు. ఆయా గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు కూడా జరగలేదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది గాని, కళాసీలు గాని ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా ఎస్ఈబీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో శంకరం, రేబాక గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

కన్నడ హీరో గొందు సిద్దు



రోలుగుంటలో ఆంజనేయస్వామిని దర్శించుకున్న కన్నడ హీరో గొందు సిద్దు

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, జనం కోరుకుంటున్న సీఎం వైఎస్ జగనేనని కన్నడ హీరో గొందు సిద్దు అన్నారు. ఆయన సోమవారం రోలుగుంట బండారు వీధిలో గల హనుమాన్ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం జరగనున్న కౌంటింగ్‌లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించాలని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు జరిపానని చెప్పారు. మేలు జరిగితేనే ఓటు వేయాలని చెప్పిన ఏకైక సీఎం అన్నారు. కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమం మరిచిపోలేదన్నారు.

నాలుగంచెల పటిష్ట భద్రత

- నిబంధనలు తూచ తప్పక పాటించాలి
- ఎస్పీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ



హాజరైన పోలీస్ సిబ్బంది

అనకాపల్లి: కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగంచెల పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. పోలీస్ సిబ్బందికి సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బందోబస్తు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. పార్టీ అభ్యర్థులు, వారి ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌లు లేవని నిర్ధారించుకున్న తర్వాతే కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతించాలని ఆయన సూచించారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల విధుల్లో సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేశారని, అదే స్ఫూర్తితో ఈ చివరి అంకాన్ని కూడా ఎటువంటి తప్పిదాలు లేకుండా క్రమశిక్షణతో విజయవంతం చేయాలన్నారు. నిరంతరం కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేస్తామని, ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించవద్దన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం (విశాఖ): వివిధ స్టేషన్‌ల నుంచి రావలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున, వివిధ నిర్వహణ కారణాల వలన పలు రైళ్లు రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైళ్లు బయల్దేరిన సమయాన్ని బట్టి అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్‌లకు చేరుకోనున్నాయి. ప్రయాణికులు మార్పులను గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

సోమవారం రాత్రి 7.10గంటలకు విశాఖలో బయల్దేరవలసిన విశాఖప –తిరుపతి (08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా రాత్రి 10.10గంటలకు బయల్దేరింది. సోమవారం సాయంత్రం 4.15గంటలకు బయల్దేరవలసిన హౌరా – కాన్యకుమారి (12665) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3గంటలు ఆలస్యంగా రాత్రి 6.30గంటలకు బయల్దేరింది. సోమవారం మధ్యాహ్నం 3.25గంటలకు బయల్దేరవలసిన షాలిమర్ – చెన్నై (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా సాయంత్రం 4.55గంటలకు బయల్దేరింది. సోమవారం మధ్యాహ్నం 3.50గంటలకు బయల్దేరవలసిన బెంగళూరు –విశాఖ (08544) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.45గంటలకు బయల్దేరింది.సోమవారం సాయంత్రం 5.25గంటలకు బయల్దేరవలసిన కన్యాకుమారి – డిబ్రూఘడ్ (22503) వివేక్ సూపర్ ఫాస్ట ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా రాత్రి 7గంటలకు బయల్దేరింది.సోమవారం సాయంత్రం 6గంటలకు బయల్దేరవలసిన సంత్రగచ్చి– తాంబరం (22841) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 18గంటలు ఆలస్యంగా మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు బయల్దేరుతుంది.

మంగళవారం తెల్లవారు 3.55 గంటలకు బయల్దేరవలసిన సికింద్రాబాద్ – షాలిమర్ (12774) ఏసీ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా ఉదయం 6.55గంటలకు బయల్దేరుతుంది. బుధవారం ఉదయం 4.20గంటలకు విశాఖలో బయల్దేరలసిన విశాఖ – బెనారస్ (18311) వీక్లీ ఎక్స్‌ప్రెస్ సుమారు 3గంటలు ఆలస్యంగా ఉదయం 7.05గంటలకు బయల్దేరుతుంది.

పెన్షన్ కోసం బ్యాంకుల వద్ద బారులు



వడ్డాది ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు వద్ద పింఛన్ డబ్బుల కోసం బారులు తీరిన లబ్ధిదార్లు

బుచ్చెయ్యపేట : పింఛను కోసం వృద్ధులు, వితంతువులకు బ్యాంకుల వద్ద ఇబ్బందులు తప్పడం లేదు. జూన్ పింఛన్ కోసం పలు గ్రామాల లబ్ధిదారులు బ్యాంకుల వద్ద బారులుదీరారు. రెండు నెలల క్రితం వరకు వలంటీర్లే ఇంటికొచ్చి మరీ పింఛను ఇచ్చేవారని, ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు కుట్రల ఫలితంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ల కష్టాలు మొదలయ్యాయన్నారు. ఇప్పుడు బ్యాంకులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డాది, రాజాం, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట, సీతయ్యపేట, ఆర్ భీమవరం బ్యాంకుల వద్ద సోమవారం వృద్ధులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ



వృద్ధురాలికి నగదు అందిస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిఖిల

పాయకరావుపేట: రాజమహేంద్రవరం ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న బల్లా నాగమణికి సచివాలయ ఉద్యోగి నిఖిల పింఛను అందజేసింది. పాయకరావుపేట సచివాలయం నుంచి రాజమహేంద్రవరంలోని స్వతంత్ర ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేయడంతో నాగమణికి ఆనందం వ్యక్తం చేసింది.

పట్టణ ఆరోగ్య కేంద్రాల తనిఖీ


పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులతో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మద్దిలపాలెం (విశాఖ): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అలసత్వం లేకుండా ప్రజలకు మెరుగైన సేవాలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో సోమవారం తనిఖీలు చేశారు. దీనిలో భాగంగా ఇసుకతోట, విద్యుత్‌నగర్, రంగిరీజు వీధి, గాంధీవీధి, చినవాల్తేరు పట్టణఆరోగ్య కేంద్రాలను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టుల సేవాలపై ఆరా తీశారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలందించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆరోగ్య సిబ్బంది ద్వారా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అందించేలా చూడాలన్నారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. అవసరమైన మందులున్నాయా లేదా అనేది పరిశీలించారు. గర్భిణులు సిజేరియన్ కాకుండా సాధారణ ప్రసవలు జరిగేలా ఆరోగ్య సిబ్బంది అవహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వోతోపాటు డాక్టర్.బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి శశిభూషన్, డీపీవో నాగభూషన్, ఎంపీహెచ్‌ఈవో తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రమేష్ హత్య కేసులో
నిందితుడి ఆత్మహత్య

- మరో నిందితురాలు శివజ్యోతితో రాజయ్యపేటలో సహజీవనం
- ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వివాదం
- మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడిన రామారావు

పెందుర్తి: నగరంలో గతేడాది సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ బర్రి రమేష్ హత్య కేసులో నిందితుడు సియాద్రి రామారావు (30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే హత్య కేసులో ప్రధాన నిందితురాలైన కానిస్టేబుల్ రమేష్ భార్య శివజ్యోతి అలియాస్ శివానీతో వివాదం కారణంగానే రామారావు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆదివారం రాత్రి పెందుర్తి మండలం రాజయ్యపేటలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి..నగరంలోని ఎంవీపీ ప్రాంతంలో నివాసం ఉంటున్న బర్రి రమేష్‌ను అతని భార్య శివానీ, ఆమె ప్రియుడు సియాద్రి రామారావు కలిసి గతేడాది ఆగస్టు 3న పథకం ప్రకారం హత్య చేశారు. దీనిపై ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేయగా కొన్నాళ్ల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు. మూడు నెలల క్రితం పెందుర్తి మండలం రాజయ్యపేటలో ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇద్దరికీ మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన రామారావు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం ఈ ఘటనపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రామారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆత్మహత్య చేసుకున్న రామారావు (ఫైల్)

పీఎంపాలెంలో 278 మద్యం బాటిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ రామకృష్ణ తదితరులు

మధురవాడ: పీఎంపాలెం ఆఖరి బస్టాప్ సమీపంలోని బక్కన్నపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం(బీ2) కాలనీలో 278 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎంపాలెం నుంచి శంభువానిపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న బీ2 కాలనీలో సోమవారం సాయంత్రం బుడుమూరి ప్రసాద్ అనే బెల్టుషాపు నిర్వాహకుడు వద్ద మద్యం ఉన్నట్టు వచ్చిన సమాచారంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆయన ఇంట్లో నిల్వ చేసిన 278 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు రామకృష్ణ తెలిపారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు


గొల్లవీధిలో కూలిపోయిన ఇల్లు

డాబాగార్డెన్స్ (విశాఖ): నగరంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ ఇల్లు నేలమట్టమైంది. ఆ ఇల్లు ఖాళీగా ఉండడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వివరాలిలా ఉన్నాయి. పాత నగరం గొల్లవీధి మసీదు జంక్షన్ సమీపాన డోరు నంబరు 20–100–5 గల ఇల్లు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా కుప్పకూలింది. ఇదిలావుండగా ఇంటి యజమాని కాశి వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. ఇల్లు కూలిందని సమాచారం ఇచ్చినా రాలేదని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి ఇల్లు కూలిన నేపథ్యంలో ఇంటికి సంబంధించిన విద్యుత్ వైర్లు నడిరోడ్డుపై వేలాడాయి. ఇటు విద్యుత్ సిబ్బందికి..పోలీసులకు..జీవీఎంసీ దృష్టికి తీసుకెళ్లినా ఉదయం 10 గంటల వరకు ఎవరూ స్పందించలేదని స్థానికులు వాపోయారు.

చిననందిపల్లి దేవస్థానం భూముల కౌలు వేలం వాయిదా


చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

దేవరాపల్లి: మండలంలోని చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి దేవస్థాన భూముల కౌలుకు సోమవారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు నిర్వహించిన వేలంపాట వాయిదా పడింది. అనకాపల్లి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, వడ్డాది దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టీఎన్ఎస్ శర్మ తదితరుల ఆధ్వర్యంలో చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం వేలం పాట నిర్వహించారు. చిననందిపల్లి సర్వే నంబర్ 50లో 3.37 ఎకరాలు, సర్వే నెంబర్ 112లో 5.03 ఎకరాలు పంట భూములకు మూడేళ్ల కౌలుకుగాను ఈ వేలం పాట నిర్వహించారు. సర్వే నంబర్ 50లో 3.37 ఎకరాలకు ప్రారంభ పాటగా ఎండోమెంట్ అధికారులు రూ. 45వేలు, సర్వే నంబర్ 112లో 5.03 ఎకరాలకు రూ.55 వేలుగా ధరావతు నిర్ణయించారు. ప్రస్తుతం వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని ఇంత భారీ మొత్తంలో వేలం పాట పాడేందుకు ధరావత్తు చెల్లించేందుకు రైతులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో బహిరంగ వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు దేవదాయ శాఖ అధికార్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోతల రఘు వెంకట ప్రసాద్, బి.కృష్ణ, మతల ఆరినాయుడు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అవలంబించాలి



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసుల రాజీకి మధ్యవర్తిత్వాన్ని అవలంబించడం అవసరమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. సోమవార జిల్లా కోర్ట్ ఆవరణలో నూతన భవన సముదాయంలోని న్యాయమూర్తుల సమావేశ మందిరంలో జరిగిన మీడియేషన్ అండ్ కన్సీలేషన్ శిక్షణా శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల ప్రాథమిక దశలోనే మధ్యవర్తిత్వ విధానాన్ని అవలంభిస్తే 90 శాతం వరకు పెండింగ్ కేసుల పరిష్కారమయ్యే అవకాశం ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. మీడియేషన్ జాతీయ శిక్షకులు న్యూఢిల్లీ కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి నిషా సక్సేనా మాట్లాడుతూ సత్వర న్యాయం అందించే దిశగా న్యాయస్థానాలు రాజీ మార్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమయం, ఖర్చులతో పాటు శాశ్వత పరిష్కారం అందించే మధ్యవర్తిత్వ విధానం కక్షిదారులకు, న్యాయవాదులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. న్యూఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ అధితి అగర్వాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రాథమిక స్థాయిలోనే కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకుంటే న్యాయస్థానాల్లో భారం తగ్గుతుతందన్నారు. కార్యక్రమంలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాల నుంచి 29 మంది న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరం ఐదు రోజులపాటు కొనసాగుతుంది.

దిశ దివ్యాంగ్ సురక్షకు 9 ఫిర్యాదులు


ఫిర్యాదు స్వీకరిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 9 మంది ఫిర్యాదులు చేశారు. దిశ దివ్యాంగ్ సురక్ష టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫోన్, వీడియో కాల్స్ చేసి బాధితులు తమ సమస్యలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు విన్నవించుకున్నారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలిని అందుబాటులో ఉంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ఇతర రాష్ట్రాల నుంచి రెండు, ఇతర జిల్లాల నుంచి మూడు, విశాఖ నుంచి నాలుగు కాల్స్ వచ్చాయి. ఈ ఫిర్యాదులను వెంటనే సంబంధిత రాష్ట్రాల, జిల్లాల అధికారులకు రాతపూర్వకంగా పోస్టల్, వాట్సాప్ ద్వారా పంపించి, అవి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నెల 15వ తేదీన నిర్వహించిన డయల్ యువర్ సీపీకి 4 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించారు.

ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్‌కు నక్కపల్లి విద్యార్థి

నక్కపల్లి: స్థానిక బీఎస్ హాకీ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థి బెంగళూరులో ఆర్మీ ఎంఈజీ బాయ్స్ స్పోర్ట్స్ స్కూలుకు ఎంపికయ్యాడు. నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొల్నాటి వెంకటేష్ ఈ ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 8వరకు బెంగళూరు కేంద్రీయ విద్యాలయ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో జరిగిన ఎడ్యుకేషన్ ఆఫ్ యంగ్ ఆర్మీ బాయ్స్ సెలక్షన్స్‌లో ఆర్మీ బాయ్స్ హాస్టల్‌కు ఎంపికయ్యాడని బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, కె.తాతాజీ తెలిపారు. ఈ విద్యార్థికి ఆర్మీ బాయ్స్ హాస్టల్‌లో ఉచితంగా చదువుతో పాటు వసతి ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. హాకీలో అత్యంత ప్రతిభ కనపరచి సెలక్షన్స్‌లో ఎంపికైన వెంకటేష్‌ను పలువురు ఉపాధ్యాయులు, హాకీ ప్రతినిధులు అభినందించారు.

నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా గుంపాన శ్రీనివాసరావు


గుంపాన శ్రీనివాసరావును అభినందిస్తున్న డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు

అనకాపల్లి: ఏపీ నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా గుంపాన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ సంఘం కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. అనకాపల్లి విజయరామరాజుపేటకు చెందిన శ్రీనివాసరావు సోమవారం తన నియామక పత్రాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌తో కలిసి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో డీసీహెచ్ఎస్ ఎస్.శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి గుంపాన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాని, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో 6 సంవత్సరాలు పనిచేశానని చెప్పారు.

ఓపెన్ పరీక్షలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: సార్వత్రిక విద్య విధానంలో జరిగే (ఓపెన్) టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి. విజయ భాస్కర్ అన్నారు. సోమవారం భీమునిపట్నం, ఆనందపురం మండలాల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షలు ఎలా జరుగుతున్నాయనేది పరిశీలించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు మాస్ కాపీయింగ్ ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఓపెన్ పరీక్షలంటే చూచిరాతలనే ప్రచారం ఉందని, అలాంటి వాటికి తావివ్వకుండా చూడాల్సిన బాధ్యత ఇన్విజిలేటర్లపై ఉందన్నారు.

6, 7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు క్లోజ్

డాబాగార్డెన్స్: బస్‌పాస్ కౌంటర్లు ఆధునికీకరించనున్న కారణంగా ఈ నెల 6, 7 తేదీల్లో తెరవబడవని జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. 8వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్ కౌంటర్లు పనిచేస్తాయన్నారు. అలాగే బస్‌పాస్ వినియోగదారులు కొత్తగా ఐడీ కార్డు చేయించుకోవాలని, పాత ఐడీ కార్డుపై బస్‌పాస్ జారీ కాదని తెలిపారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ విన్నర్ విశాఖ జోన్


ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ విన్నర్‌గా నిలిచిన విశాఖ జోన్ జట్టు

తగరపువలస: ఈ నెల 6,7,8వ తేదీల్లో విజయవాడలో జరగనున్న జూనియర్ బాయ్స్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్ పోటీలకు విశాఖ జోన్ జట్టు విన్నర్స్‌గా నిలిచింది. సోమవారం కొమ్మాది విజ్ఞాస్ గ్రౌండ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో అనకాపల్లి, విశాఖ జోన్ జట్లు పాల్గొన్నాయి. వీటితో బెస్ట్ ఆఫ్ త్రీ ఆడించగా విశాఖ జోన్ జట్టు విన్నర్‌గా గెలిచి విజయవాడలో జరుగు ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌కు వెళ్లనుంది. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ ఎస్.జె.రామకృష్ణ, కోచ్ శేషుమోహన్, వీడీఎఫ్ఏ కార్యదర్శి అక్కరమాని చినబాబు, రాజారావు, మాని తదితరులు పాల్గొన్నారు.

జీతాలపై యాజమాన్యంతో కార్మిక సంఘాల భేటీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాలపై కార్మిక సంఘాలు యాజమాన్యంతో భేటీ అయ్యాయి. కార్మిక నాయకులు సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం ఉక్కు పరిపాలన భవనానికి వెళ్లిన నాయకులు సీఎండీ అందుబాటులో లేకపోవడంతో డైరెక్టర్ (పర్సనల్) పాండే, డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్‌లతో సమావేశమయ్యారు. పిల్లలకు ఫీజులు కట్టాల్సి ఉన్నందున వెంటనే జీతాలు చెల్లించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై యాజమాన్యం ప్రస్తుత పరిస్థితులు, ఖర్చుల నేపథ్యంలో ఈనెల 15న ఇస్తామని చెప్పినట్టు నాయకులు తెలిపారు. దీనిపై నిరసన వ్యక్తం చేసిన కార్మిక నాయకులు బుధవారంలోగా జీతాలు ఇవ్వకపోతే ఆందోళన చేస్తామని స్పష్టం చేసి వెనుతిరిగారు. సమావేశంలో కార్మిక నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, జి. గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1999 తరువాత రంపచోడవరంలో మళ్లీ లెక్కింపు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- మోహరించిన పోలీసు బలగాలు

రంపచోడవరం: నియోజకవర్గ కేంద్రం రంపచోడవరంలో 25 సంవత్సరాల తరువాత మళ్లీ ఇప్పుడు ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నారు.1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ ఓట్లు లెక్కింపు జరిగింది. తరువాత జరిగిన 2004 ఎన్నికల కౌంటింగ్ రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరులో నిర్వహించారు. తరువాత 2009, 2014, 2019 ఎన్నికల కౌంటింగ్ కాకినాడలో నిర్వహించారు. కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లా నుంచి తప్పించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేర్చారు. ఏజెన్సీలో ప్రాంతంలో ఎన్నికల నిర్వహణ అధికారులకు కత్తిమీద సాముగా ఉంటుంది. పోలింగ్ జరిగిన తరువాత ఈవీఎంలను జిల్లా కేంద్రం పాడేరులోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం చాలా కష్టతరమైన అంశం. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో రంపచోడవరంలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలో 2,77,317 మంది ఓటర్లు ఉండగా ఈ ఎన్నికల్లో 2,08,025 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.01 శాతం పోలింగ్ నమోదయింది. ఏజెన్సీ ప్రాంతం కావడంతో పోలింగ్‌ను సాయంత్రం 4 గంటలకే ముగించారు. రంపచోడవరంలో నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీకి 20 రౌండ్లు, పార్లమెంట్‌కు 20 రౌండ్లలో ఓట్లు లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

రంపచోడవరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఆర్వో ప్రశాంత్‌కుమార్‌లు పరిశీలించారు.అరకు పార్లమెంట్ స్థానం ఓట్లు లెక్కింపును రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, అసెంబ్లీ ఓట్ల లెక్కింపును ఆర్వో ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షిస్తారు. భద్రత ఏర్పాట్లును ఏఎస్పీ జగదీష్ అడహళ్లి పరిశీలించారు. ఎన్నికల లెక్కింపు జరుగుతున్న రంపచోడవరానికి వివిధ మండలాల నుంచి ఎవరు రాకుండా పోలీస్ అధికారులు ఎక్కడిక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఐ పోలవరం జంక్షన్ వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వాహనాల్లో ఎక్కువ మంది ప్రయాణిస్తే వారిని నిలిపివేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్‌లో కూడా పోలీసు బలగాలు మోహరించాయి. కౌంటింగ్ కేంద్రం నుంచి రంపచోడవరం సెంటర్ వరకు ఎటువంటి రాకపోకలు జరగకుండా ఆంక్షలు విధించారు.


కౌంటింగ్ ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

119 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

మాడుగుల: మాడుగులలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు మాడుగుల స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఎస్ఐ కె.హేమంత్ తెలిపారు. సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండగా బెజవాడ రాజేశ్ 119 మద్యం బాటిళ్లతో పట్టుబడ్డాడు. వీటి విలువ రూ.20 వేలు ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు. రాజేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

73 మద్యం బాటిళ్లతో మరొకరు..

రోలుగుంట: బుచ్చింపేట గ్రామంలో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అమ్మకాలు చేస్తున్న షాపులు, గృహాలపై కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్సై ఎల్.సురేష్, సిబ్బంది సోమవారం దాడులు చేశారు. గ్రామానికి చెందిన గాలి నూకరాజు ఇంటిపై దాడి చేసి 73 బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి నూకరాజును రిమాండుకు తరలించినట్టు ఎస్సై విలేకరులకు వివరించారు.


మద్యం బాటిళ్లతో అరెస్టయిన నిందితుడు నూకరాజు, సీఐ అప్పలనాయుడు, ఎస్సై సురేష్


మాడుగులలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

కన్నకొడుకే కాలయముడు

తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని...
తల్లిని హత్య చేసి పరార్


ఆదమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్

గంగవరం: జన్మనిచ్చిన పాపానికి ఓ తల్లిపాలిట కన్నకొడుకే కాలయముడిగా మారాడు. తాగేందుకు డబ్బులివ్వలేదన్న కోపంతో కన్నతల్లి అని కూడా చూడకుండా గోడకు తలను కొట్టి హతమార్చాడు. ఈ హృదయ విదారకర సంఘటన మండలంలోని నూగుమామిడిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపిన వివరాలు... కొలుతూరి అబ్బాయి, ఆదమ్మ(54) భార్యాభర్తలు. వీరికి వివాహాలైన ఇద్దరు కొడుకులున్నారు. పెద్ద కొడుకు బాలయ్య భార్యతో కలిసి అదే గ్రామంలో నివాసముంటున్నాడు. చిన్నకొడుకు కృష్ణను భార్య విడిచి వెళ్లిపోవడంతో గ్రామంలోనే తల్లిదండ్రులతో ఉంటున్నాడు. నిత్యం తాగుతూ తిరగడమే పనిగా పెట్టుకున్నాడు. రోజూలాగే తాగేందుకు ఆదివారం రాత్రి కూడా తల్లిని డబ్బులు అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోడంతో గొడవపడ్డాడు. తీవ్ర ఆగ్రహంతో తల్లి తలను గోడకు కొట్టాడు. గొడవ జరగడంతో కొడుకు తనను కూడా కొడతాడేమోనని భయపడి తండ్రి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన తల్లి ఆదమ్మ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. తల్లిని హత్య చేసి కృష్ణ పరారయ్యాడని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. అడ్డతీగల సీఐ రవికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారని, ఆయన ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌బీ హెచ్‌సీ రాజారావు వివరాలు సేకరించారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

క్లుప్తంగా

ఎన్నికల ఫలితాల కోసం ఉత్కంఠగా...

కశింకోట : మండల ప్రజానీకం సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం ఎంతో ఉత్కంఠ భరితంగా ఎదురు చూస్తున్నారు. మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించి మళ్లీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగలరని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారితో పాటు పందెం రాయుళ్లు లక్షలాది రూపాయలు పందాలు కూడా కాశారు. అనకాపల్లి ఎంపీతోపాటు జిల్లాలోని మాడుగుల, యలమంచిలి, చోడవరం, నర్సీపట్నం, అనకాపల్లి తదితర చోట్ల వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థులే విజయం సాధించగలరని ధీమా వ్యక్తం చేస్తూ పలు మండల గ్రామాల్లో ఆసక్తి ఉన్న వారు రూ.లక్షల్లో పందాలు కాశారు. ఎవరికి వారే విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఫలితాల కోసం పార్టీల శ్రేణులు, పందెం రాయుళ్లతో పాటు ప్రజలు, అభిమానులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

అమరజీవికి నేడు నివాళి

అనకాపల్లి : పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నామకరణ చేసి నేటికి 16 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో పొట్టి శ్రీరాముల విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నట్లు శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరాట్ల నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం పలు నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర పెరిగింది. కిలోకి రూ.10 అదనంగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి పెరిగింది. బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40కి పెరిగింది. ఇక ఉల్లిపాయ, వంకాయ రూ.30, దొండకాయ,బెండకాయ రూ.40, బీరకాయ రూ.50, గోరు చిక్కుడు, బరబాటి, బీట్రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. మామిడి, ఇతర పండ్ల అమ్మకాలు ఎక్కువగా సాగాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో మామిడి పండ్లు ఎక్కువగా సంతకు విక్రయానికి వచ్చాయి. బంగినపల్లి, సువర్ణరేఖ వంటి ఉత్తమ రకాలతో పాటు రసాలు రకం పండ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. డజన్ 200 నుంచి రూ.300 వరకు పరిమాణం,రకం అనుసరించి అమ్మకాలు సాగాయి. ఈ వారం ఆనాస పండ్లు కూడా ఎక్కువగా అమ్మకానికి వచ్చాయి. వీటిని పరిమాణం అనుసరించి ఒక్కొక్కటి రూ.50 నుంచి రూ.70కి విక్రయాలు జరిగాయి. సపోటా కిలో రూ. వందకు విక్రయించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 113 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,360	4,980
రెండో రకం	4,060	4,350
మూడోరకం	3,410	4,000

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	: రాజా
గం గం గణేశా	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్ మీ	: షిర్డిసాయి
హిట్ లిస్ట్	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
బాక్	: శ్రీసత్య
భజే వాయు వేగం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి:జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే

- అందరిచూపు కౌంటింగ్ వైపు
- కొన్ని గంటల్లో ఉత్కంఠకు తెర



శంకరం గ్రామంలో పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి : గత సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ విశాఖ ఏయూలో నిర్వహించారు. ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ సీటు పరిధిలో ఒక జిల్లా ఏర్పాటు చేయడం జరిగింది. అనకాపల్లి కేంద్రంగా రెండేళ్ల క్రితం కొత్త జిల్లాను ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా జిల్లాల్లో 6 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. అనకాపల్లి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గ ప్రజలు సర్వత్రా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. కొన్ని గంటల్లోనే ఈ ఉత్కంఠకు తెరపడనుంది. మే 13న నియోజకవర్గ ఓటర్లు ఎమ్మెల్యే అభ్యర్థుల భవిష్యత్‌ను ఈవీఎంలలో ఓటు ద్వారా తెలియజేశారు. 22 రోజుల తరువాత ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యంపై ఉత్కంఠకు కొన్ని గంటల్లో తెరపడనున్నది. ఈసారి ఎన్నికల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని రాత్రి 8 గంటల వరకూ ఓటర్లు వారి వారి ఓట్లను వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరికి వారు తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 2019లో 2,04,699 ఓటర్లు ఉండగా 2024లో 2,13,714 మంది ఓటర్లు కాగా 1,70,582 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనకాపల్లి పట్టణ, మండల, కశింకోట మండల పరిధిలో ఏర్పాటు చేసిన 251 పోలింగ్‌బూత్‌ల పరిధిలోని ఆయా రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు నేతలు గత 22 రోజులుగా ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ గెలపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం నాటికి గెలిచే అభ్యర్థుల వివరాలు తెలిసిపోతాయి. నియోజకవర్గం నుంచి 12 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో నిలవగా ప్రధానపార్టీ వైఎస్సార్‌సీపీ, జనసేన పార్టీల మధ్య గట్టిపోటీ నేలకొంది.

144 సెక్షన్ అమలు...

ఎన్నికల లెక్కింపు సందర్భంగా మంగళవారం నియోజకవర్గ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్టు సీఐలు జి.శంకరరావు, ధనంజయరావు, వినోద్‌కుమార్ చెప్పారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఇద్దరి కంటే ఎక్కువ మంది సంచరించ రాదని చెప్పారు. ప్రధాన పార్టీల కార్యాలయాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎన్నికల కౌంటింగ్ 8 గంటలకు ప్రారంభం

మండలంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఫ్యూచర్ వర్డ్ స్కూల్ వద్ద మంగళవారం ఉదయం 8 గంటలకు ఎన్నికల కౌంటింగ్ జరుగుతుంది. ఉదయం 9.30 గంటలకు మొదటి రౌండ్ పూర్తి అవుతుంది. మధ్యాహ్నం 2 గంటల లోపు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపు, ఓటముల వివరాలు కలెక్టర్ ప్రకటించనున్నారు.

2024లో నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య

- నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,13,714 మందికి గాను 1,70,582 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.
- పురుషులు 1,03,088 మంది ఓటర్లు గాను 82,053 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- మహిళలు 1,10,621 మందికి ఓటర్లకు గాను 88,520 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- ఇతరులు 5 మంది ఓటర్లుకు గాను 3 ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- మొత్తంగా 79.82 శాతం ఓట్లు పోలయ్యాయి.

కశింకోట కూడలిలో సోలార్ వెలుగులు



కశింకోట కూడలిలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ లైట్లు



సోలార్ పలకలు అమరుస్తున్న సిబ్బంది

కశింకోట : కశింకోట కూడలిలో జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో రూ.24 లక్షలు ఖర్చు చేసి సోలార్ విద్యుత్ లైట్లను సోమవారం ఏర్పాటు చేసింది. కూడలిలో రెండు వైపులా చెరో పది వంతున సోలార్ పలకలు, లైట్లతో ఇప్పటికే నిర్మించిన కాంక్రీట్ దిమ్మెలకు క్రేన్ సహాయంతో వేగవంతంగా స్తంభాలు అమర్చారు. విద్యుద్దీపాలు ప్రతి రోజూ సాయంత్రం నుంచి ఉదయం వరకు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే కూడలిలో సరైన విద్యుద్దీపాలు లేక చీకటిలో దారి కానక ప్రజలు, వాహన చోదకులు రోడ్డు దాటడానికి తీవ్రంగా ఇబ్బంది పడేవారు. పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకునేవి. సమస్యను పోలీసు ఉన్నతాధికారులతో పాటు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జాతీయ రహదారి అథారిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్కటి రూ.లక్షా 20 వేలు ఖర్చు చేసి 20 సోలార్ విద్యుద్దీపాలు మంజూరు చేసి ఏర్పాటు చేశారు. దీంతో వెలుగులు విరజిమ్మి రాత్రి వేళ రోడ్డు దాటడానికి ఇబ్బందులు తొలగనున్నాయని స్థానికులు, వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

28 మద్యం బాటిళ్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పాయకరావుపేట : పట్టణంలో సోమవారం ఉదయం అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. పట్టణానికి చెందిన గొంతిన అనిల్ బాబు అనే వ్యక్తి గోనె సంచితో 28 మద్యం బాటిళ్ల ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గమనించి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మండలంలో భారీ వర్షం

- రోడ్లు జలమయం
- పంటభూములు, చెరువుల్లోకి చేరిన నీరు



తాళ్లపాలెం వద్ద పోలవరం కాలువలో చెరువులా చేరిన వర్షపు నీరు



తాళ్లపాలెం సంత వద్ద రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

కశింకోట : మండలంలో తొలకరించింది. ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంట పైగా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం వల్ల పంట భూములు, పల్లపు ప్రాంతాలు, మామిడివాక గెడ్డ, చెరువుల్లోకి కొంతమేర నీరు చేరింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. తాళ్లపాలెంలోని సంత వద్ద రోడ్డుపైకి నీరు నిల్వ ఉండడంతో సంతకు వచ్చే ప్రజలు సోమవారం ఇబ్బంది చెందారు. అక్కడి పోలవరం కాలువలో కూడా వర్షపు నీరు చెరువులా చేరింది. వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం చెరకు తోటలకు ఉపకరించనుందని రైతులు తెలిపారు. అలాగే ఖరీఫ్‌కు ముందు వేసవి దుక్కులు చేసుకోవడానికి ఉపకరిస్తుందని తెలిపారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



మూలపేటలోని గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం ఆడారి రామకోటి -వెంకట పద్మ దంపతులు రూ.25వేలను విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, పెద్దలు ఆడారి జగన్నాథరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచండి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: వర్షా కాలం నేపథ్యంలో ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చౌడువాడ సీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల సూచించారు. గొండుపాలెంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను నిర్వహించారు. 139 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలను నిర్మల చేశారు. మురుగునీటి నిల్వలు ఉంటే దోమకాటు వల్ల ప్రజలు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడే పరిస్థితి ఉంటుందని ఆమె తెలిపారు. దోమలు నిర్మూలన వల్ల మంచి ఆరోగ్యాన్ని పొందగలరని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కనకవేణి, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్‌ఎం కుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతికథల బోధన



మునగపాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు

మునగపాక : నీతికథల ద్వారా విద్యార్థులకు సన్మార్గం ఉద్బోధించారు. శాఖా గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు పలు నీతి కథలను వివరించారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి శిబిరంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారితో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వనజ

దేవరాపల్లి: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దేవరాపల్లిలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో జరిగిన శిబిరంలో 120 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శిబి రానికి వచ్చిన ప్రజలకు వివరించి, ఉచితంగా మందులు అందజేశారు. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ, పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ భవానీ, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ హరిచందన, క్యాంప్ కో ఆర్డినేటర్ అశ్వినికుమార్, నర్సింగ్ స్టాఫ్ దేవి, స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

మాకవరపాలెం: రోడ్డు మధ్య ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా పడింది. విశాఖ నుంచి నర్సీపట్నం వైపు వస్తున్న కారు సోమవారం తెల్లవారుజామున మండలంలోని తామరం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వర్షం కారణంగా అదుపుతప్పి, డివైడర్ పైకి దూసుకుపోయింది. ఆ వెంటనే కారు బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడగా కారు ఇంజిన్ భాగం దెబ్బతింది.

స్వేరో నేషనల్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయండి



స్వేరో ప్రతినిధులు

కోటవురట్ల: ఈ నెల 30వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే స్వేరో నేషనల్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల విద్యార్థి సంఘం నాయకుడు పడవల చక్రవర్తి కోరారు. కోటవురట్లలో స్వేరో సంఘ ప్రతినిధులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ స్వేరోలు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్వేరో ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర కన్వీనర్ చిట్టియ్య, నాయకులు గంటేడ అప్పలరాజు, రాజుబాబు, కొండలరావు, కోటి, రాజు, సంజీవ్ పాల్గొన్నారు.

నూకాలమ్మా...జయమునీయుమా..



నూకాంబిక అమ్మవారి ముఖద్వారం వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

228 కొబ్బరి కాయలతో పూజలు

అనకాపల్లి : నూకాంబిక అమ్మవారి కృపతో మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి, అనకాపల్లి ఎమ్మెల్యేగా మలసాల భరత్‌కుమార్, ఎంపీగా బూడి ముత్యాలనాయుడు అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని వైఎస్సార్‌సీపీ నాయకులు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ముఖ ద్వారం పాదాలు వద్ద 228 కొబ్బరి కాయలు కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయని, ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ, సుంకరమెట్ట దేవస్థానం చైర్మన్ దేవాలయం చైర్మన్ కె.ఎం.నాయుడు, జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు శ్రీధరాల మనోజ్ , ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మున్నూరు శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, పార్టీ నాయకులు ఆడారి శ్రీనివాసరావు, పెంటకోట అప్పలనాయుడు, రాయవరపు జోగి రాజు, నడిగట్ల మధు, దొడ్డి హరిబాబు పాల్గొన్నారు.

కార్మిక లోకానికి ఆదర్శం సత్యనారాయణ జీవితం



సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీహెచ్.నర్సింగరావు

అనకాపల్లి : బడుగు, బలహీన వర్గ ప్రయోజనాల కోసం దేశంలో సీఐటీయూ ఏర్పాటు చేసిన పరస సత్యనారాయణ ఆశయ సాధనకు కార్మిక లోకం కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సత్యనారాయణ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయు వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట వీరుడు కామ్రేడ్ సత్యనారాయణ శత జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తన జీవితాంతం బడుగు బలహీన వర్గాలు, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కృషి చేసి చిరస్థాయిగా నిలిచినట్టు తెలిపారు. నేటి కార్మిక వర్గం ఆయన స్ఫూర్తి పొందాలని వాడవాడల కార్మికుల ఐక్యం చేయడం, వారి సమస్యలపై పోరాడడం నిత్య కృత్యంగా మారాలన్నారు. నేటి సమకాలీన రాజకీయాలలో నిస్వార్థంగా పనిచేయడంతో పాటు, ప్రభుత్వాలు పెట్టే అన్ని రకాల నిర్బంధాలను, ఆటుపోట్లు తట్టుకొని నిలబడిన సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. లోకనాథం మాట్లాడుతూ కార్మిక వర్గం సమస్యల పోరాటానికి సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నేటి తరానికి నికార్సయిన ఆదర్శ మూర్తి సత్యనారాయణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.నాగేశు, జిల్లా అధ్యక్షుడు శంకరరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి, వీఓఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్ శాంతి పాల్గొన్నారు.

రహదారులపై గోతుల పూడ్చివేత



తాళ్లపాలెంలో పోలవరం కాలువ వద్ద గోతులు పూడ్చిన రోడ్డు



తాళ్లపాలెం సంత వద్ద బాగు చేసిన రోడ్డు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సంత ప్రాంతంలో రోడ్డు గోతులు పూడ్చి బాగు చేశారు. తాళ్లపాలెం-నర్సీపట్నం మార్గంలో ఉన్న తాళ్లపాలెం సంత వద్ద, అక్కడి పోలవరం కాలువ ప్రాంతం గోతులతో నిండి ఉండడం వల్ల వర్షం వచ్చిందంటే నీరు నిల్వ ఉండిపోయి వాహనాలు మరమ్మతులకు గురై ఆగిపోవడం, దిగబడిపోయి అడ్డంగా నిలిచిపోయేవి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేది. ఈ నేపథ్యంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఇటీవల పోలవరం కాలువ, సంత ప్రాంతాల్లో గోతులను పూడ్చి వాటిపై తారుతో రోడ్డు వేశారు. రోడ్డు బాగు పడడం, వర్షం వచ్చినా నీరు నిల్వ ఉండకుండా ప్రయాణానికి ఇబ్బంది లేకుండా సాగుతుండడంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



తాళ్లపాలెం హైస్కూల్లో సమావేశమైన 1993-94 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూలులో 1993-94లో టెన్త్ చదివిన టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు అమీర్, చల్లారావు, రమేష్, అనులను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. వారి ఆశీస్సులు పొందారు. చివరిగా విద్యార్థులు గ్రూపు ఫోటో దిగారు.

బాలలకు చిత్రలేఖన పోటీలు



తాము వేసిన డ్రాయింగ్స్‌తో బాలలు

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు సోమవారం ఆటల పోటీలతో పాటు డ్రాయింగ్, కథలు, బుక్ రీడింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గత నెల 15 నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బాగా చిన్నారులకు ఆటపాటలతో పాటు పుస్తకాలు చదివించడం, నీతి కథలు చెప్పడం వంటివి చేస్తున్నారు. బాలలకు ఏయే కళలపై ఆసక్తి ఉందో తెలుసుకుని, వాటిలో తర్ఫీదు ఇస్తున్నారు. అందులో భాగంగా సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వీరందరికీ జూన్ 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ వరహామణి తెలిపారు.